ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. స్వర్ణాంధ్ర సాధన దిశగా పయనిస్తోందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ సీఐఐ సదస్సులో వచ్చిన పెట్టుబడులకు రక్షణ కల్పించేలా చట్టం తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక సదుపాయాలే పునాది అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.
- ❖ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ తెలియజేశారు.

==========

`వికసిత్ భారత్` లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర సాధన దిశగా పయనిస్తోందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. విశాఖలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ... విభజన గాయాలతో ఇబ్బందులు పడిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అభివృద్ధిలో పురోగమిస్తోందన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడిని సాధించడం సామాన్య విషయం కాదని.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఎలక్ట్రానిక్స్, స్పేస్, డిఫెన్స్, టూరిజం లాంటి రంగాల్లో రాష్ట్రం పెట్టుబడులను ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు. దేశం ఓ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి అవసరమైన రంగాలపై అందరం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న ఆయన.. దేశీయ పరిశ్రమలు అంతర్జాతీయ పోటీని తట్టుకునేలా సిద్ధం కావాలన్నారు. ఎంఎస్ఎంఈలతో పాటు పరిశ్రమలు, పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పించాలని, మానవ వనరుల నైపుణ్యాలను పెంచుకుని భారతీయ మేధోసంపత్తిని ప్రపంచానికి చాటాలని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకెన్లు)

==========

సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సదస్సు ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి పత్రికా సమావేశంలో మాట్లాడుతూ... పెట్టుబడుల గురించే కాక.. వివిధ అంశాలపై అర్థవంతమైన చర్చలు జరిగాయని పేర్కొన్నారు. సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల పురోగతిని గమనిస్తూ.. కార్యరూపం దాల్చేలా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. 2024 జూన్ నుంచి వచ్చిన పెట్టుబడులకు రక్షణ కల్పించేలా చట్టం తెస్తామని, ఎంఓయూల సాకారంపై ఆడిట్ రిపోర్ట్ ఇస్తూ.. కుదుర్చుకున్న ఒప్పందాల్లో ఏ మేరకు గ్రౌండింగ్ అవుతున్నాయనే అంశంపై ప్రతీ ఏడాది వివరిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులన్నీ రియల్ టైమ్‌లో ఇస్తున్నామని, దీని ద్వారా పరిశ్రమల ఏర్పాటు సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అమరావతి.. క్వాంటం కంప్యూటర్ హబ్ కానుందని, త్వరలోనే మేడిన్ అమరావతి క్వాంటం కంప్యూటర్లు విదేశాలకు ఎగుమతి అవుతాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 30 సెకెన్లు)

==========

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక సదుపాయాలే పునాది అని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. 31వ CII భాగస్వామ్య సదస్సులో భాగంగా `రోడ్స్ టు వికసిత్ భారత్ : హైవేస్, లాజిస్టిక్స్, ఆంధ్రప్రదేశ్ గ్రోత్ కారిడార్` అనే అంశంపై విశాఖలో ఈరోజు నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 2014లో ఆంధ్రప్రదేశ్‌లో 4 వేల 100 కిలోమీటర్లు ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్.. 2026 నాటికి 8 వేల 700 కిలోమీటర్లకు చేరుకుందన్నారు. రాష్ట్రంలో మొత్తం 3 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు చేపడుతుండగా, ఇప్పటివరకు 60 వేల కోట్ల రూపాయలతో 4 వేల 750 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

==========

పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విశాఖలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టే ఈ మహాకార్యంలో ఇన్వెస్టర్లందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి రాష్ట్ర అభివృద్ధికి, లక్షలాది కుటుంబాల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం వల్ల పరిశ్రమలకు వర్తించే అన్ని రాయితీలు టూరిజం ఇన్వెస్టర్లకు అందుతున్నాయని తెలిపారు. కాగా.. సదస్సు రెండో రోజున మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో 860 కోట్ల రూపాయల విలువైన 10 ప్రాజెక్టులతో ఎంఓయూలు, 336 కోట్ల రూపాయల విలువైన 2 ప్రాజెక్టులతో జీవోల మార్పిడి జరిగింది.

==========

కాకినాడ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపడుతోందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. నగరపాలక సంస్థ, జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, తదితర వివరాలను ఆయన ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో వెల్లడించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 66 వార్డులకు సంబంధించి వార్డు కార్పొరేటర్లతో

పాటు మేయర్ పదవికి ఎన్నికల కోసం మొత్తం 306 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, 30వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలియజేశారు.

==========

శత్రుచర్ల విజయరామరాజు ప్రజల మనసుల్లో శాశ్వతంగా నిలిచి ఉంటారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. దివంగత మాజీ మంత్రి శత్రుచర్ల అంత్యక్రియలు పార్వతీపురం మన్యం జిల్లా చినమేరంగిలో ప్రభుత్వ లాంఛనాలతో ఈరోజు జరిగాయి. ప్రభుత్వ విప్, కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి, పార్వతీపురం శాసన సభ్యులు బోనెల విజయ చంద్రలతో కలిసి మంత్రి ఈ కార్యక్రమాలకు హాజరయ్యి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.. శత్రుచర్ల మృతి ఈ ప్రాంతానికి తీరని లోటని అన్నారు. 5 సార్లు ఎమ్మెల్యేగా, 3 సార్లు ఎంపీగా, 3 సార్లు రాష్ట్ర మంత్రిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ప్రజలకు ప్రాతినిధ్యం వహించారంటూ ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

==========

పశ్చిమ గోదావరి జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 5 మండలాల్లోని 90 గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలియజేశారు. భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలకు ఈ నెల 26న ఎన్నికలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలకు సంబంధించి ఈ నెల 14, 15, 16వ తేదీల్లో నామినేషన్లు స్వీకరణ జరుగుతుందని తెలిపారు. 17వ తేదీన నామినేషన్ల పరిశీలన, 19న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరుగుతాయని అన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 188 వార్డులకు 443 పోలింగ్ కేంద్రాలు, 3 వేల 50 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నవంబరు 30న ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.

==========

విశాఖలో రియల్ ఎస్టేట్ రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ అన్నారు. నారెడ్కో (NAREDCO) నార్త్ జోన్ ఆధ్వర్యంలో విశాఖలో 3 రోజుల పాటు జరగనున్న వైజాగ్ ప్రాపర్టీ ఎక్స్‌పో-2026ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో విశాఖ నగరం అంతర్జాతీయ స్థాయి వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని, ఈ నేపథ్యంలో రియల్ ఎస్టేట్ సంస్థలు.. నివాస సముదాయాలతో పాటు వాణిజ్య భవనాలు, ఆఫీస్ స్పేస్‌లు, ఆధునిక వ్యాపార మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

==========
==========